

# రంగధామం




భానుమూర్తి గురించి కాలేజీలో అనేకమంది అనేక రకాలుగా అనుకుంటారు. బి. యస్‌సి. రెండో సంవత్సరం చదువుతూ, ఎప్పుడూ ఏదో శూనిరాగం తీస్తూనో, లేక ఏదో బొమ్మ గీస్తూనో ఉండే అతని పొడుగాటి విగ్రహం అందరికీ సుపరిచితమే. హాస్టలు గోడలనిండా, భానుమూర్తి పుస్తకాలనిండా, పెన్సిల్ గీతలతో వేసిన అనేక రకాల బొమ్మలన్నీ ఇంచుమించు ఒకేరకమైన కనుముక్కుతీరూ, ఆకారం గల స్త్రీ రూపాలవడంచేత స్నేహితులకి అతనిమీద 'ఎవరినో అమ్మాయిని ప్రేమించాడు!' అన్న అనుమానం ఏర్పడేట్లు చేశాయి.

సుమారు ఏణ్ణర్థంనుంచి భానుమూర్తిలో ఒక నూతన చైతన్యం ప్రారంభమైంది. అంతకుముందు కాలేజీలో అతని నెవరూ ఎరుగరు. కాని, హఠాత్తుగా భానుమూర్తి పాటలూ, బొమ్మలూ అందరి దృష్టినీ ఆకర్షించసాగాయి. కాలేజీ అమ్మాయిలు సైతం మూర్తి పాటల్ని తెగపొగుడుతూ, అతని బొమ్మలకోసం ఎగబడ నారంభించారు. కర్మం చాలక భానుమూర్తి ఆడపిల్లల రూముకి వెళ్ళాడో, అతనిచుట్టూ అమ్మాయిలంతా చేరి, అతని పాటల్ని పొగడడం, అతని బొమ్మలు కావాలనడం, ఎవరికి వారు అతనిదృష్టి నాకర్షించాలని ప్రయత్నించడం



తప్పదు. మగపిల్లలంతా అతని అదృష్టాన్ని చూసి అసూయపడేవారు. కొందరు అతని పేరు, ఒకరిద్దరు అమ్మాయిల పేర్లతో జోడించారు. అతనికి అనేక దుర్వ్యసనాలున్నాయనీ, నడత మంచిదికాదనీ రహస్య ప్రచారం చేశారు. కాని, అతనిముందు ఎవరూ ఏమీ అనేవారుకారు. ఎందువల్లనంటే అతనంటే అందరికీ కొంత భయభక్తులున్నాయి. దానికి కారణం, భానుమూర్తికి బలిష్ఠమైన కండలు తిరిగిన శరీరమే కాక, స్నేహితులకోసం ఖర్చుపెట్టే శక్తికూడా ఉంది.

మునుపు పొట్టిలాగూలూ, మాసిన చొక్కాలూ తొడుగుతూఉండే భానుమూర్తి, చక్కని ఉలెన్ పాంట్లూ, సిల్కుచొక్కాలూ వెయ్యడం ప్రారంభించాడు. కాలేజీ స్టూడెంట్లలోనే చనువుగా మునుపు మెలలేనివాడు, ఇప్పుడు లెక్చరర్లతో సన్నిహితంగా మెలగనారంభించాడు. ముఖ్యంగా హిస్టరీ లెక్చరరు భాస్కరరావుగారు భానుమూర్తికి బొమ్మలు వేయుడంలో ఎంతో ప్రోత్సాహమిచ్చి, తరుచూ తమ ఇంటికి తీసుకువెళ్తూండడంవల్ల అతనికి ఇతర లెక్చరర్ల స్నేహం కూడా భాస్కరరావుగారివల్ల లభించింది. గిరిజ భాస్కరరావుగారి భార్య. ఆమె కూడా బొమ్మలు వేస్తుంది. భానుమూర్తిని "తమ్ముడూ, నువ్వు కృషిచేస్తే, గొప్ప పెయింటర్ వవుతావు" అనేది. మొదట్లో నటరాజూ, త్రిమూర్తీ, బుద్ధుడూ మొదలైన బొమ్మలు వేస్తూండే భానుమూర్తి క్రమంగా స్త్రీ స్వరూపాలూ, వివిధ భంగిమలలో స్త్రీ విగ్రహం, అజంతా బొమ్మలూ వెయ్యనారంభించాడు. అతని బొమ్మల్లో ఒకే పోలికగల్గి, వివిధ భంగిమలలో కన్పించే ఒక స్త్రీరూపం పరిశీలించేవారికి స్పష్టంగా కన్పించేది.

కళాకారుడిని ఏ రూపమైతే విపరీతంగా ఆకర్షిస్తుందో, ఆ రూపమే అతని పెన్సిలుద్వారాగాని, కుంచెద్వారాగాని వ్యక్తమవుతుందని కొందరి అభిప్రాయం. ఇతరుల సంగతెలావున్నా, భానుమూర్తి విషయంలో అది నిజం.

సుమారు ఏణ్ణర్థం క్రిందట భానుమూర్తి, తన పెత్తల్లిఊరైన కృష్ణాపురం అనే ఒక పల్లెటూరికి వెళ్లాడు. చిన్నప్పుడెప్పుడో పదేళ్ల వయస్సులో ఆ ఊరు వెళ్లాడు. తరువాత మళ్లీ ఎనిమిదేళ్ల తరువాత ఆ ఊరు వెళ్లాడు. ఈలోగా ఆ ఊరులోనూ కొన్ని మార్పులు వచ్చాయి. భానుమూర్తీ బాగా మారాడు. పల్లెటూళ్లోఉన్న పెత్తల్లికి పిల్లలు లేకపోవడంవల్ల భానుమూర్తంటే చాలా ఇష్టం. ఆమెదృష్టిలో అతను చాలా పసివాడు. అందువల్ల అతనికి వచ్చిన మర్నాడే తలంటు ప్రయత్నం తలపెట్టింది. "ఒరేయ్ భానూ! ఎంతమారిపోయావురా! హోస్టలు—మెతుకులు; తిని, ఆరోగ్యం చెడగొట్టుకుంటున్నావు. పాడు చదువులు పిల్లల ప్రాణాలు తీసేస్తున్నాయి. మీ అమ్మకి నీ తరవాత నలుగురు పిల్లలాయె. లేకపోతే అది వచ్చి వండిపెట్టును. పోనీ, నాలాటిది వచ్చి, ఇంత ఉడకేసి పెడదామన్నా, నాకు తీరికేదీ? చూస్తున్నావుకదా, ఇక్కడ కామాటం. తెల్లవారి లేచింది మొదలు, గొడ్లతోటీ, పాలేర్లకు వండిపెట్టడంతోటీ, ఇంటిపనులతోటీ సతమతమైపోవాలికదా! వచ్చేపోయే కొంపాయె. ఇదిగో ఈ కాఫీ త్రాగి పెరట్లోకి పద. తలంటుకి అన్నీ సిద్ధం చేశాను" అని ఆవిడ వంటింట్లోకి వెళ్లింది.

భానుమూర్తి బద్ధకంగా ఆవలించాడు. ఈ వేసంకాలపు సెలవుల్లో కొన్నిరోజులు తన పెత్తల్లిగారింట్లో గడపాలని వచ్చాడు. కృష్ణాపురం బొత్తిగా పల్లెటూరు. బస్సెక్కాలంటే అరమైలుదూరం వెళ్లాలి. అలాటి కుగ్రామంలో ఏం తోస్తుంది? కొన్ని తెలుగు నవలలు వెంట తెచ్చుకున్నాడు చదవడానికి. పల్లెటూరిలో కొన్ని మంచి సీనరీలు చిత్రిద్దామని కూడా ఉందతనికి. కాని, తీరా ఆ పల్లెటూరికి వచ్చాక చిత్రించడానికి తగిన ఉత్సాహం కలగలేదు.

పెత్తల్లిచేత తలంటి పోయించుకుని, కాఫీత్రాగి ముందుగదిలో కూచొని ఒక నవల తీశాడు భానుమూర్తి. పేజీలు తిరగెయ్యడానికి ఉపక్రమించాడు కాని, మనస్సు పుస్తకంమీద లగ్నం కాలేదు. ఇంతలో ఒక అమ్మాయి తెల్ల పరికిణీమీద నీలివోణి వేసుకుని, గుండ్రటిమొహంలో అందమైన కాటుక కళ్లూ, తెల్లనిఛాయా కలిగి, సుమారు పదిహేనేళ్ల వయసులో చక్కని శరీర సౌష్ఠవంతో చూడగానే మనుష్యుల నాకర్షించకలిగే అందం కన్పిస్తూంటే, భానుమూర్తి చదువుకుంటున్నగదిలో కొచ్చింది.

"ఏం బావా! జ్ఞాపకమున్నావా?" అంటూ, ఎదురూ బెదురూ లేకుండా వచ్చి, భానుమూర్తి కుర్చీ పక్క కుర్చీలో కూచుంది. భానుమూర్తి తెల్లబోయాడు. ఎవ రీ అమ్మాయి? అని ప్రశ్నించుకున్నాడు.

"రాధా! వచ్చావుటే! ఇక మీకు కాలక్షేపానికి లోటుండద్దు" అంటూ భానుమూర్తి పెత్తల్లి కూడా వచ్చింది. "ఒరేయ్! దీని కెప్పుడూ పుస్తకాల పిచ్చేరా. నువ్వు తెచ్చిన పుస్తకాలన్నీ రెండు రోజుల్లో చదివేస్తుంది. ఎప్పుడూ, ఈ ఊళ్లో తనకేమీ తోచదని గోలపెడుతుంది. దీనితో నిన్న చెప్పాను నువ్వు వస్తున్నావని. చిన్నప్పుడు మీ రిద్దరూ కలిసి ఆడుకునేవారుకదూ! అది అప్పటినుంచీ నిన్ను గురించి అడుగుతూనే ఉండేది. అందుకని నువ్వు వస్తావని చెప్పగానే చాలా సంతోషించింది" అని ఆవిడ భానుమూర్తికి పాత రోజుల్ని గుర్తుకు తెచ్చింది. భానుమూర్తికి లీలగా పాత రోజులు గుర్తుకు వచ్చాయి. ఆ రోజుల్లో రాధా, తనూ కలిసి ఆడుకున్నారు. కాని, ఆ రాధ మరోవిధంగా ఉండేది. గౌనులు తొడుక్కునే రోజుల్లో, చింపిరిజుట్టుతో, వికారంగా కన్పించిన రాధ, ఇవాళ చాలా అందంగా కన్పిస్తోంది. రాధా వాళ్లనాన్న తనకూ దూరబంధువు. ఆ ఊరిలో కరిణీకం చేస్తాడు. వాళ్లది చాలా సామాన్య కుటుంబం. ఈ విషయాలన్నీ జ్ఞాపకమొచ్చి, చిరునవ్వు నవ్వాడు భానుమూర్తి.

"నువ్వు చాలా పెద్దదానివయ్యావు రాధా!" అన్నాడు భానుమూర్తి. రాధ చిరునవ్వు నవ్వింది. భానుమూర్తి మనసులో ఒక చిన్న ఆనందలహరి వీచింది. భానుమూర్తి పెత్తల్లి—ఆమె పేరు సీతమ్మగారు—రాధను "అప్పుడే నీళ్లు తెచ్చేశావుటే చెరువు నుంచి?" అని అడిగింది.

"లేదత్తా! బిందె తీసుకుని ఇప్పుడే బయల్దేరాను. దారిలో బావ నొకసారి చూసిపోదామని వచ్చాను. ఏది బావా? నీ పెట్టె తెరూ, ఏమేమి విచిత్రాలున్నయో చూస్తాను. నీ చేతిలో పుస్తకం ఇలా తే" అని భానుమూర్తిచేతిలో పుస్తకం లాక్కుని పేజీలు తిరగెయ్యసాగింది. తనతో చిన్నప్పుడు కలిసిమెలిసి ఆడిన రాధే అయినా, ఆమె చనువుకి భానుమూర్తి కొంచెం ఆశ్చర్యపడసాగాడు. అతని ఊహ ప్రకారం వయసొచ్చిన ఆడపిల్లలు, తలుపువారన నక్కి, తల వంచుకుని, బెదురు చూపులు చూస్తూ, పదిమాటలకొక మాట జవాబుచెప్తూ సిగ్గును ప్రకటిస్తారు గాని, ఇలా ప్రక్కనే వచ్చి, కూచుని, పెట్టెలు

—44 పేజీ చూడండి



డాక్టరు జాన్సన్సు
చవనామృతము
అందరికి టానిక్కు
బాలరక్ష
పిల్లల ఆరోగ్యముకు
ఏజంట్లు: లక్ష్మీనారాయణకంపెనీ
— కాకినాడ.

కోరువారికి
సూచీపత్రములు
పంపుదుము.
★
స్టాకిస్టులు
కావలెను
★
లక్ష్మీనారాయణ
కంపెనీకి
వ్రాయండి.

పౌడర్లలోకెల్ల మేలైనది
రాజా
టాల్క్
• బహు ప్రత్యేకమైనది
• మంచి సువాసనగలది
• చాల మృదువైనది






తయారుచేయువారు:
ప్రఖ్యాత 'రాజా స్నో'
తయారుచేయువారిచే తయారుచేయబడినది
మణ్యాం & కంపెనీ, బెంగుళూరు-20.

క్రింది చోట్లయందు లభించును:
బెజవాడ వెంకన్న & సన్సు. రాజమండ్రి. ∗ పువ్వాడ పుల్లయ్య & సన్సు, విజయవాడ. ∗ రామా ఏజెన్సీస్. నెల్లూరు. ∗ రవి & కంపెనీ, 5 తె. బందరు వీధి,-మద్రాసు-1. ∗ సిటీ ఎంపోరియం. మాణిక్యమందిర్, కాకినాడ.


# గగన కుసుమం

17 వ పేజీ తరువాయి

తనిఖీచేసి, పుస్తకాలు చేతుల్లోంచి లాక్కోరు. కాని, రాధ చాలా విచిత్రవ్యక్తిలా కన్పించిం దతనికి.

"నువ్వు తెచ్చిన పుస్తకాలన్నీ నేను చదవనివే. వరసగా ఒక్కొక్కటే చదివేసి ఇస్తాను. సినిమా పాటల పుస్తకాలేమైనా తెచ్చావా?" అని అడిగింది రాధ.

"లేదు" అన్నాడు భానుమూర్తి.

"లేదా? ఊహూ—పోన్లే, నీ కొచ్చిన పాటలు నువ్వు రాసిపెట్టు. అప్పుడప్పుడు రికార్డులలో కొత్త సినిమా పాటలు వింటూఉంటాను. పత్రికలలో సినిమాల గురించి చదువుతూ ఉంటాను. ఈ ఊళ్లో సినిమా హాలైనా లేదు" అంది చాలా విచారం ప్రకటిస్తూ రాధ.

"నీకు పాటలంటే చాలా ఇష్టంలా ఉంది. ఏమైనా పాడ్తావా?"

రాధ చిన్న చిరునవ్వు నవ్వుతూ, భానుమూర్తి వంక చూసింది. ఆ చూపు భానుమూర్తి మనసులో ఏదో తెలియని మార్పు తెచ్చింది. "ఏదో కొద్ది కొద్దిగా పాడగల్ను" అంది మెల్లగా రాధ.

ఇంతకుముందే బిందె తేవడానికి ఇంట్లోకి వెళ్ళిన సీతమ్మగారు, బిందె తెచ్చుకుని లోపల్నించి వచ్చింది. "పదవే రాధా! మళ్లీ వంట కాలస్యమైపోతుంది" అని చెరువుకి మంచినీళ్లకోసం రాధని బయల్దేరతీసింది. రాధ కూడా వెళ్ళడాని కుద్యుక్తురాలైంది.

"మరి ఒక పాట పాడి వినిపించవ్?" అని అడిగాడు మూర్తి.

"మధ్యాహ్నం వచ్చి పాడతానులే, బావా!" అంటూ రాధ, సీతమ్మగారి వెనకాల బయల్దేరింది. వెళ్లే ముందు, భానుమూర్తివైపు ఒకసారి సూటిగా చూసింది.

రాధ వెళ్ళిపోగానే అద్దంలో ఒకసారి తన మొహం చూసుకుని, "ఫరవాలేదు" అని తన రూపం గురించి తృప్తిపడ్డాడు. మూర్తి జుట్టు దువ్వేఉంది. బట్టలు బాగానే ఉన్నాయి. తనని చూసి, ఆమె 'మనిషి బాగు లేడు—'అని అనుకోడానికి ఏమాత్రం అవకాశంలేదు.

మధ్యాహ్నం రాధ మళ్లీ వచ్చింది. అమాయకంగా నవ్వుతూ, సరదాగా ఎన్నో కబుర్లు చెప్పింది. పాటలు పాడింది. భానుమూర్తి కాలేజీ గురించీ, చదువు గురించీ ఎన్నో ప్రశ్నలు వేసింది. భానుమూర్తిలో కూడా మామూలుకన్నా ఎక్కువ ఉత్సాహం ప్రవేశించింది. ఏవేవో కబుర్లూ, కథలూ ఉత్సాహంగా, రసవత్తరంగా చెప్ప నారంభించాడు. అతని మాటలకు రాధా, సీతమ్మగారూ తెగ నవ్వారు. 'బావ బలేగా మాట్లాడతాడని' రాధ పొగిడింది. రాధ తనని మెచ్చుకుంటూంటే భానుమూర్తి హృదయం పొంగిపోయింది.

మర్నాటినుంచి రాధ ముప్పొద్దులా సీతమ్మగారింట్లోనే గడపసాగింది. భానుమూర్తి పాటలు పాడేవాడు. రాధ అతన్ని మెచ్చుకొనేది. రాధ మాటలు వింటూంటే, అతను ఈ ప్రపంచాన్నే మరచేవాడు. అవి అతి—సాధారణ సంభాషణలే. మామూలు

విషయాల గురించి అందరూ అనుకునే మాటలే. కానీ, ఆ మాటలే రాధ నోటంట వింటూ, భానుమూర్తి మైమరచేవాడు. అతనికి రాధరూపం, రాధ మాటలూ, రాధ నవ్వులూ, ఆమె హావభావాలూ మనసులో శాశ్వతంగా ముద్రపడిపోయాయి. కాలేజీలో తను చూసిన అమ్మాయిల తీరు వేరూ, రాధ తీరు వేరూ. తను కాలేజీలో అమ్మాయిలకు దూరదూరంగా తిరిగేవాడు. వాళ్ళూ వీలైనంతగా మగపిల్లల్ని తప్పించుకు తిరిగేవారు. కాని, తన తోటి విద్యార్థులు వాళ్ళతోటి మాట్లాడాలని తహతహలాడేవారు. వారి ఆతృతలో ఉండే ఆంతర్యం భానుమూర్తి కిప్పు డర్థమైంది. రాధలాటి అమ్మాయిలు కాలేజీలో ఉన్నారో లేదో అతనికి తెలియదు. కాని, ఉంటేమాత్రం వాళ్ళ వెనకాల ప్రతి కాలేజీ కుర్రాడు తిరగటంలో ఎంతమాత్రం విశేషంలేదు!

రాధ సమక్షంలో నెలా పదిహేనురోజులు చాలా తొందరగా గడిచాయి. ఈ సమయంలో తనకు తెలియకుండానే భానుమూర్తి చాలా మారిపోయాడు. ఎప్పుడూ సరదాగా, హుషారుగా కాలం గడపాలి గాని, దిగులుగా, బరువుగా ఆలోచించకూడదనుకున్నాడు. ఏ విషయానికైనా ఇతరులేమనుకుంటారో అని జడిసేకన్నా, ఆ పనికాస్తా చేసేసి, వాళ్ళేమనుకున్నా, పట్టించుకోకుండా తిరగాలనుకున్నాడు. తను కూడా ఒక ప్రాముఖ్యతగల మనిషేననీ, రాధలాగ తనని మెచ్చుకునేవాళ్ళు కూడా ప్రపంచంలో ఉంటారని తెలుసుకొన్నాడు. ఒంటరిగా ఉన్నప్పుడు ఒకసారి గట్టిగా నవ్వుకున్నాడు. తనచుట్టూ ఉన్న మనుష్యులకన్నా, తను కొన్ని అంగుళాల ఎత్తు ఎదిగినట్లు భావించాడు.

ఈ నెలా పదిహేనురోజుల్లోనూ రాధను తను ఒక విషయం అడగాలనుకున్నాడు. అది 'రాధ తనని ప్రేమిస్తోందా? లేదా?' అన్న విషయం. ఎన్నో సారులు తనూ, రాధా కథల్లోనూ, సినిమాలలోనూ ప్రేమ గురించి మాట్లాడుకొన్నారు. అలాటి సమయంలో రాధ నీ ప్రశ్న అడుగుదామనుకునేవాడు. కాని, సూటిగా అడగలేకపోయేవాడు. ఆమె కళ్ళల్లోనూ, మాటల్లోనూ వ్యక్తమయ్యేదంతా తన మీద ప్రేమేననుకునేవాడు. ఆమె సాన్నిధ్యంలో తను పొందుతున్న ఆనందానికి తమ అంతర్యాలలోఉండే అనుబంధమే కారణమని ఊహించుకున్నాడు. 'నువ్వెంతో బాగా పాడతావు బావా!" అని తన కళ్ళల్లోకి నిదానంగా, సూటిగా చూసే ఆమె కాటుక—కళ్ళూ, కదిలే ఆమె లేత పెదవులూ, విశాలమైన ఆమె నుదిటిమీద మెరసే కుంకుమబొట్టూ, ఏవో సందేశాలు తన కందిస్తున్నట్లు అనిపించే దతనికి.

భానుమూర్తి మనసు ఒక్కసారిగా వికసించింది. తన పరిసరాలలోని సౌందర్యం అతను చక్కగా ఆకళింపు చేసుకున్నాడు. కృష్ణాపురం ఊరి చివర చెరువూ, ఆ చెరువుపక్కన కోవెలా, దూరంగా కన్పించే కొండలూ, పొలాలూ, పశ్లపడుచులూ, చిత్రాలన్నీ అతని పెన్సిలులోంచి పైకుబికి రాసాగాయి. ఆ బొమ్మలు చూసి రాధ ఎంతో మురిసిపోయింది. ఒకానొక సమయంలో రాధ బొమ్మ వెయ్యాలనిపించిం దతనికి. వేస్తే చాలా బాగా వచ్చింది. ఆ బొమ్మను చూసి, రాధ పొంగిపోయింది.

సెలవు లాఖరున తను ఆ ఊరినుంచి వెళ్ళిపోతూంటే, చిన్నవుచ్చుకున్న మొహంతో, తనకు వీడ్కోలిచ్చిన రాధ స్వరూపం భానుమూర్తి మనసులో ఎప్పటికీ కదలనని పీఠం వేసుకుంది. ఎప్పటికైనా రాధనే తను వివాహమాడాలని నిశ్చయించుకున్నాడు.

ఆ సంవత్సరం కాలేజీలో బి. ఎస్‌సీ. లో చేరిన భానుమూర్తి బొమ్మలు వెయ్యడంలోనూ, పాటలు పాడడంలోనూ ఎంతో ఉత్సాహం చూపించి, తోటి విద్యార్థులచేతేకాక, లెక్చరర్లచేత కూడా మన్ననలు పొందనారంభించాడు. ఆ సంవత్సరాంతాన, కాలేజీ వార్షికోత్సవంలో భానుమూర్తి కెన్నో ప్రైజులొచ్చాయి. గర్వంగా వాటి నందుకుంటూ, మనసులో ఈసారి సెలవులకి కృష్ణాపురం వెళ్ళినప్పుడు రాధకు తన బహుమతులన్నీ చూపించాలనుకున్నాడు.

కాని, భానుమూర్తి ఆ సెలవులలో తను అనుకున్నట్టు కృష్ణాపురం వెళ్ళలేకపోయాడు. తండ్రికి టైఫాయిడ్ రావటంవల్ల ఎక్కడికీ కదలలేకపోయాడు. ఆయనకు బాగా తగ్గేసరికి మళ్ళీ కాలేజీలే తెరిచారు. రెండురోజులైనా, పెత్తల్లి ఇంటికి వెళ్ళి గడుపుదామనుకున్నాడుగాని, వీలుపడలేదు. రాధ ఎలా ఉందో, ఏం చేస్తుందో అని ఆలోచిస్తూ, వివిధ భంగిమలలో ఆమె బొమ్మల్ని గీస్తూండేవాడు ఒక పుస్తకంలో.

బి. యస్‌సి. రెండో సంవత్సరంలో భానుమూర్తికి అనేకమంది స్నేహితులయ్యారు. అతనిలో మూడు ప్రత్యేకత లున్నాయి. పాటలు బాగా పాడతాడు. బొమ్మలు వేస్తాడు. మంచి 'పెరసనాలిటీ' గల యువకుడు. ఇవికాక— స్నేహితులకోసం డబ్బు బాగా ఖర్చు పెడతాడు. గంటల తరబడి సిగరెట్లు కాలుస్తూ ప్రేమ గురించి కబుర్లుచెప్తూ, ఆ నిషాలో కాలాన్నీ, విధ్యుక్తధర్మాన్నీ మర్చిపోయే స్నేహితులు అతనికి కొందరున్నారు.

అందరికన్నా అతనితో ఎక్కువగా స్నేహంగా తిరిగేది రంగారావు అనే యువకుడు. రంగారావు "లవ్" అనే సబ్జక్టు మెయిన్‌గానూ, ప్రేమపాటలూ, మాటలూ సబ్సిడియరీస్‌గానూ ఒక డిగ్రీకోర్సు ఏర్పాటు చెయ్యనందుకు యూనివర్శిటీవాళ్ళను ఎప్పుడూ నిందిస్తూంటాడు. అతని శాయశక్తులా 'లవ్' మీద రిసెర్చిచేసి, కొంత విజ్ఞానం సంపాదించాడు. అప్పుడప్పుడు హాస్టల్లో కుర్రాళ్ళను నలుగుర్ని పోగుజేసి, 'లవ్' అండ్ 'సైకాలజీ'మీద లెక్చర్లు దంచుతూంటాడు. అతను, ముందు కొన్నాళ్ళు 'లవ్' గురించి భానుమూర్తితో చర్చించిన తరువాత ఒకనాడు రెండు పెట్టెల సిగరెట్లూ, నాలుగు కప్పుల కాఫీ పూర్తిచేసి, భానుమూర్తి ఎవరినైనా ప్రేమించాడా? అన్న ప్రశ్న లేవతీశాడు.

ఆరోజు భానుమూర్తికి రాధ ఎందువల్లనో పదే పదే జ్ఞాపకం రావడంలో హృదయంలోని రహస్యం ఎవరితోనైనా చెప్పుకోవాలనిపించింది. రంగారావూ, తనూ—ఇద్దరే ఆ సమయంలో ఉండటంవల్ల, అతని ప్రేమగాథంతా అనుకోకుండానే భానుమూర్తి అతనితో చెప్పేశాడు. అంతా విని రంగారావు అతన్ని కొన్ని ప్రశ్నలు వేశాడు. "మీ ఇద్దరిమధ్యా 'లవ్ లెటర్సు' నడుస్తున్నాయా?" అని అడిగాడు.

"లేదు" అని జవాబిచ్చాడు భానుమూర్తి.

రంగారావు ఆశ్చర్యపడ్డాడు. "అదేమిట్రా? నువ్వు ఇంతగా ప్రేమిస్తున్న అమ్మాయితో నీకు ఉత్తర ప్రత్యుత్తరాలు లేకపోవడమేమిటి? ఎన్నాళ్ళనుంచీ ఆగిపోయాయి!


"అసలు ప్రారంభమే కాలేదు."

ఈసారి రంగారావు మరీ ఆశ్చర్యపడ్డాడు. నల్లగా పొడుగ్గా ఉండి, ఎప్పుడూ పైజామా, లాల్చీలు, ధరించే రంగారావు, భానుమూర్తి వ్యవహారం తన 'రిసెర్చి'కి చాలా ఉపకరిస్తుందని ఊహించాడు.

"అయితే లవ్‌లెటర్సు రాయకుండానే ఇంత గ్రంథం నడిపావన్నమాట!"

"అబ్బే! గ్రంథం ఏమీలేదు. ఊరికే ఆమెను ప్రేమించాననుకో."

"అదేలే! వ్యక్తిగతంగానే ప్రేమను తెలియపర్చావన్నమాట."






వుడ్‌వార్డ్స

'గ్రైప్ వాటర్'

తెలివైన తల్లులు

50 ఏళ్లనుంచి వాడుచున్నారు




అధికారయుత ఏజెంటు: కోమల్ మేన్యుఫేక్చరింగ్ కెమిస్ట్స్ లిమిటెడ్ బొంబాయి; ఎమ్.జి. వహాబ్ అండ్ కో., (కలకత్తా) ప్రైవేట్ లిమిటెడ్ కలకత్తా; టి.టి. క్రిష్ణమాచారి అండ్ కో., మద్రాస్; ఎమ్. జి. వహాబ్ అండ్ కో; (ఢిల్లీ) ప్రైవేట్ లిమిటెడ్, ఢిల్లీ.

Aiyars OP. 148 TEL.


# గగన కుసుమం

భానుమూర్తి కొద్దిసేపు ఆలోచించాడు. "నే నసలు నా ప్రేమను ఆమెకు తెలియపర్చనేలేదు" అన్నాడు.

"మరి?—ఆమే తన ప్రేమను నీకు వెల్లడించిందా?"

"అదీ లేదు" అన్నాడు భానుమూర్తి ఆలోచిస్తూ.

"అయితే మీ రిద్దరూ లోకాభిరామాయణం చెప్పుకుంటూ కాలం గడిపేవారా?"

"అలాగే అనుకోవచ్చు."

రంగారావు చేతిలోని సిగరెట్టు పారేశాడు. కొంచెం కోపంగా, "అసలు ప్రేమ వ్యవహారంఅంటే ఏమిటో నీకు తెలుసా?" అని అడిగాడు, కొంత వెటకారం గొంతుకలో వ్యక్తపరుస్తూ.

"నిజంగా నాకు తెలియదు. నే నామెను మనస్ఫూర్తిగా ప్రేమించాను. అంతకుతప్ప నాకేం తెలియదు" అన్నాడు భానుమూర్తి తనవల్ల ఏదో లోపం జరిగిఉండవచ్చునని భయపడుతూ.

రంగారావుకి అతని అమాయకత్వం చూసేసరికి నవ్వు వచ్చింది. "ఒరేయ్! మీ కళాకారులతో వచ్చిన చిక్కే ఇదిరా. మీదంతా ఊహా ప్రణయమేరా. అసలా అమ్మాయి మనస్సెలాటిదో, ఆమె నిన్ను ప్రేమించిందో, లేదో కనుక్కోవద్దూ. అంత చలాకీ అమ్మాయితో ప్రేమ వ్యవహారం ఎంత సరదాగా ఉంటుందో తెలుసా" అంటూ, రంగారావు తన ప్రణయ అనుభవాలు కొన్ని వర్ణించి చెప్పాడు.

అవన్నీ విన్న భానుమూర్తి "నా కీ విషయాల్లో నీకున్న చొరవగానీ, అనుభవంగానీ లేవురా. పైగా, రాధ నలా చూస్తూ నేను అనుభవించే ఆనందం కన్నా, మించిన ఆనందం, ఆమె ప్రేమవల్ల కలుగుతుందని నాకు తోచలేదు. అయినా ఈసారి తప్పక ఆమె నడుగుతాను. అంతేకాదు; ఆమెను వివాహమాడి తీరతాను. ఆమెను తల్చుకుంటూంటేనే నే నింత ఆనందం పొందగల్గుతున్నప్పుడు, ఆమె నాదయితే ఇంకా నేను ఎంత ఆవేశం పొందుతానో!" అన్నాడు.

"అదే నేనూ అంటూన్నాను. ఇప్పటికైనా, నీ ఊహా ప్రణయం చాలించి, అసలు రంగంలోకి దిగు!" అని హెచ్చరించాడు రంగారావు.

ఆనాటినుంచి భానుమూర్తి ఎప్పుడు పరీక్షలయిపోయి సెలవలిస్తారా? ఎప్పుడు కృష్ణాపురంవెళ్ళి రాధ సాన్నిధ్యంలో వాలిపోదామా! అని ఎదురు చూడసాగాడు. ఈసారి తనూ, రాధా ఏకాంతంగా ఉన్నప్పుడు ఆమెతో తన ప్రేమ గురించి చెప్పాలి! అతని ఊహాపథంలో తను, రాధా—ఇద్దరూ చెరువు ఒడ్డున చెట్టుక్రింద నిర్జన ప్రదేశంలో కూచుని, సాయంకాలపు ప్రకృతి సౌందర్యం తిలకిస్తూ, తన్మయులైపోతామని అనుకునే దృశ్యం ఒకసారి మెలిగేది. మరొకసారి తను రాధను, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని, ఏవో ప్రశ్న లడుగుతాడు; రాధ వాటికి కొంటెగా జవాబిస్తుంది. తను నవ్వుతాడు. ఆమెకూడా నవ్వుతుంది. త నంటాడు: "రాధా! నువ్వు వట్టి కొంటెపిల్లవి. నిన్ను పెళ్ళిచేసుకుని నీతో ఎలా వేగుతానో తెలియకుండాఉంది!" రాధకు కోపం వస్తుంది. "అయితే పోన్లే! నన్ను పెళ్ళే చేసుకోవద్దు!" అని

బుంగమూతి పెడుతుంది. తను ఆమెను ఎంతో బ్రతిమాలి, చివరకు ఆమె కోపం పోగొట్టాడు. అప్పు డామె, "బావా! నువ్వెంత మంచివాడివి!" అంటుంది. తన హృదయం పరవశమౌతుంది. రాధకి మొగలిరేకు జడంటే చాలా ఇష్టం. తన పొడుగాటి జడనిండా మొగలిరేకులు పెట్టుకుని, కళ్ళకు కాటుక దిద్దుకొని, వోణీ వేసుకుని, చేతిలో ఏదో పళ్ళెం, ఆ పళ్ళెంలో కొన్ని ఫలహారాలతో, పరికిణీ కుచ్చెళ్ళు వయ్యారంగా కదుల్తూ, తన గదిలోకి వచ్చి, "ఇదిగో, కాలేజీ అబ్బాయిగారికి పల్లెటూరి ఫలహారం" అన్నప్పుడు తను ఆమెవైపు చూస్తూ, "చాలా బాగున్నాయి" అంటాడు. దాని కామె, "తినకుండానే రుచెలా తెలుస్తుంది?" అని అడుగుతుంది. "కొన్నిటిని చూస్తేనేఅవి చాలా బావుంటాయని తెలుస్తాయి" అని ఆమె బుగ్గలవైపుచూపిస్తాడు. దాని కామె, పై పళ్ళతో కిందిపెదవి నొక్కి, కళ్ళెర్రచేస్తుంది. తను ఆమెచెయ్యి పట్టుకోబోతాడు. ఆమె అత్తయ్యా!" అని అరుస్తూ గదిలోంచి పారిపోతుంది. తను, కొంచెం భయపడతాడు. "ఏమిటే?" అంటుంది వంటిట్లోంచి పెత్తల్లి. కొంపతీసి తను చెయ్యిపట్టుకోబోయానని చెప్పేస్తుందేమోనని తన గుండెలు జారిపోతాయి. కాని వంటిట్లోంచి. "ఫలహారం బావుందిట. బావ ఇంకొంచెం కావాలంటున్నాడు" అన్న రాధమాటలు విన్పిస్తాయి. తన గుండె కుదుటబడుతుంది. అంత కొంటెతనం, అంత మంచితనం రంగరించిన రాధ మనసు తనదనుకున్నప్పుడు ఏదో తెలియని ఆనందం పొందుతాడు భానుమూర్తి.

రాధను గురించి మధురమైన ఊహలు ఊహించుకుంటూ ఆ రెండో సంవత్సరం కాలంగడిపేశాడు భానుమూర్తి.

రంగారావు, సెలవుల్లో భానుమూర్తిని కృష్ణాపురం తప్పకవెళ్ళమనీ, రాధని వివాహం చేసుకునేప్రయత్నం చెయ్యమనీ బలవంతం చేశాడు. భానుమూర్తి ఆ నిశ్చయంతోనే కృష్ణాపురం బయల్దేరాడు. తన మిత్రుడిని ఒక మంచి కార్యానికి ప్రోత్సహించాననే తృప్తిని రంగారావు పొంది, చాలా ఆనందించాడు.

ఆఏడు వేసవికాలపు సెలవుల్లో ఒకనాడు రోడ్డుమీద పచారుచేస్తున్న రంగారావుకి, పొట్టిగా సన్నగా, మొహంమీద స్ఫోటకంమచ్చలు కల్గి, వరిగిపోయిన లాల్చీ—పైజామాలతో, రేగిపోయినజుట్టుతో ఒక వ్యక్తి కన్పించాడు. అతన్ని చూసి రంగారావు కావలించుకున్నంత పనిచేశాడు. "ఒరేయ్! వెంకటీ! ఎప్పుడొచ్చావురా? ఎక్కడున్నావురా ఇన్నాళ్ళూ? ఎన్నాళ్ళయిందిరా మనం కలుసుకొని!" అని అతన్ని చూడడంలో తనకు గల్గిన ఆనందాన్ని ప్రకటించాడు. ఆ వ్యక్తిపేరు వెంకట్రావు! అతనూ రంగారావూ బాల్యస్నేహితులు. వెంకట్రావు గొప్పకవి! అతనన్నా, అతని కవిత్వమన్నా రంగారావుకి చాలా ఇష్టం. వెంకట్రావు మంచికవిత్వం చెప్తాడుగాని, అదృష్టం లేకపోవడంవల్ల పైకిరాలేదు. ఎప్పుడూ బెజవాడా, తెనాలి, నెల్లూరు, మద్రాసు మొదలైన ఊళ్ళుతిరుగుతూ, స్నేహితులవద్ద కాలక్షేపం చేస్తూంటాడు.

అతన్ని రంగారావు తనింటికి తీసికెళ్ళి, స్నానం వగైరాలుచేయించి, తన బట్టలు కట్టుకోడానికిచ్చి, భోజనమయింతరువాత అతనితో బాతాఖానీ ఆరంభించాడు. కళ విషయంలోనూ, సాహిత్య విషయంలోనూ రంగారావుకి వెంకట్రావు గురువు. వెంకట్రావుకి ఎన్నో సంస్కృతకావ్యాలూ, తెలుగు కావ్యాలూ కంఠతా వచ్చు. అతనివి మధురమైన భావాలు. అతని ఆలోచనకూడా చాలా సూక్ష్మంగా ఉంటుంది. విమర్శ చాలాబాగా చేస్తాడు. రంగారావు భానుమూర్తి విషయం అతనితో చెప్పాడు. రాత్రిపూట, ఆరుబయట వెన్నెలలో డాబామీద ఇద్దరూ సిగరెట్లు కాలుస్తూ కూర్చున్నారు. దూరాన సముద్రపు హోరు వినిపిస్తోంది. రంగారావు చెప్పినదంతా వెంకట్రావు విన్నాడు.

"ఒరేయ్, రంగా! ఒక విషయంలో నువ్వు పొరబడ్డావురా" అన్నాడు వెంకట్రావు మెల్లిగా ఆలోచిస్తూ. రంగారావదేమిటో చెప్పమన్నాడు.

"భానుమూర్తి రాధను ప్రేమిస్తున్నాడని నే ననుకోను. కేవలం ఆమె సౌందర్యం అతనిలో ఒక చైతన్యం తీసుకొచ్చింది. ఆమె నొక సౌందర్య దేవతగా అతను ఆరాధించాడు. ఆమెతో పరిచయం ఏర్పడినదగ్గర్నుంచీ, అతని మనస్సు మామూలు లోకంలోనుండి ఉన్నతస్థాయికి వెళ్ళి, సౌందర్య లోకంలో విహరించసాగిందని నే నూహిస్తున్నాను. ఆ సౌందర్యాన్ని అలా నిలుపుకోగలిగినంతకాలం, అత నొక ఉత్తమ కళాకారుడు! ఆ స్థాయిలో వ్యక్తిగత భావాలకూ, ఆవేశాలకూ, మోహాలకూ తావులేదు. వాటి కతీతమైన స్థితి అది! కళాకారుడికి, సౌందర్యసృష్టిలో కలిగే ఆనందం భౌతిక అనుభవంలో ఎప్పటికీ లభించదు. పైగా భౌతికానందంమీదకు అతనిదృష్టి ఎప్పుడు మళ్ళుతుందో అప్పు డతని సౌందర్యసృష్టి ఆగిపోతుంది. నువ్వు అతన్ని ఉన్నతస్థాయిలోంచి, క్రిందకు లాగడానికి ప్రయత్నించావు. తగిన మనోబలంలేని యువకుడవడంవల్ల నువ్వు చెప్పినదే నిజమనుకొన్నాడు".

రంగారావు మెల్లిగా ఆలోచిస్తూ, "అయితే, రాధ సాహచర్యంవల్ల అతని కళ అభివృద్ధి చెందదంటావా?"

"చెందుతుందని, ఖచ్చితంగా చెప్పలేము. కాని, భౌతికంగా రాధయొక్క ప్రభావం వేరు. ఆమె సౌందర్యం వేరు!"

"ఇంతకీ రాధని పెళ్ళాడడంవల్ల భానుమూర్తి కళాభివృద్ధి జరగదంటావా?" అని అడిగాడు రంగారావు తన ఊహ తప్పో ఒప్పో తేల్చుకుందామని.

"జీవితం నువ్వనుకున్నంత సులభం కాదురా రంగా!" అని మెల్లిగా అన్నాడు వెంకట్రావు. రంగారావు మాటాడకుండా ఊరుకొన్నాడు. ఒక్కొక్కప్పుడు వెంకట్రావు మాటలు అతని కర్థంకావు. వెంకట్రావుకి కళన్నా, సౌందర్యమన్నా అతి సున్నితమైన, పవిత్రమైన భావాలున్నాయి. వాటికి ఎదురుచెప్పి, ఎవరూ అతనితోవాదించలేరు. పైగా తీవ్రంగా ఆలోచిస్తేనే కాని అతను మాట్లాడడు. రంగారావు, భానుమూర్తి భవిష్యత్తు ఎలా ఉంటుందో చూసిన తరువాత, మళ్ళీ అతని విషయం వెంకట్రావు దగ్గర ఎత్తవచ్చుననుకున్నాడు.

భానుమూర్తి ఆ ఏడు సెలవుల్లో కృష్ణాపురం వెళ్ళాడేకాని, అక్కడ ఎక్కువరోజు లుండలేక


క్యాలెండర్లు

నాణ్యమైన ఫోటో ఆఫ్‌సెట్ క్యాలండర్లకు మమ్ము సంప్రదించండి. క్యాలండరు బొమ్మలను క్యాలెండరు మ్యానుఫ్యాక్చరర్లకు, ప్రింటర్లకు ప్రత్యేక ధరలకు సప్లయి చేయుదుము.
మంచికమీషను పైపని చేయుటకు సమర్థులైన ఏజంట్లు కావలెను. వ్రాయండి.
ELITE CALENDAR Co.,
P. B. 1927, MADRAS-1



డాక్టర్ వృత్తి చేయండి!



విరామ కాలంలో ఇంటిలా పోస్టల్ ట్యూషన్ ద్వారా హోమియోపతి చదివి. గవర్నమెంటు రిజిష్టర్డ్ కాలేజిద్వారా డిప్లొమా పొందండి.

ప్రాస్పెక్టస్ ఉచితం. వెంటనే వ్రాయండి
INDIAN HOMOEOPATHIC COLLEGE
(APW), JULLUNDUR CITY





జామ్-బక్
శమనపర్చు మాన్పును!

మీరు జామ్-బక్‌ను వాడితే తరువాత మంట పెట్టదు. ఎందుకనగా, దానిలో ఎన్నబడిన మూలికా అంటువిరోధక ఔషధులు గలవు. చర్మవాపులకు, తెంగటి వాట్లు నొప్పులకు, లోక ప్రసిద్ధమైన జామ్-బక్‌ను వాడండి. ఆయింట్‌మెంటు జామ్-బక్‌తో మీకు తక్షణ శమనము గలుగును. దీనిలో జంతు ద్రవ్యాలు మూవెలు లేవని గ్యారంటీ చేయబడినది.

Zam-Buk
జామ్-బక
మూలికా బామ్



ఇది మందుల వ్యాపారు లందరివద్దను దొరుకును.
సి. ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కొంపెనీ.

సోల్ ఏజంట్లు : దాదా & కంపెనీ,
86, సైనప్పనాయక వీధి, మద్రాసు-1.

# క్రొత్త రీసా రేడియో



5, నోవల్ వాల్వులు 3 బ్యాండ్సు ఎ.సి.
అందమైన కొయ్య కాబినెట్
ధర : రు. 235/-
(ఎక్ సైజ్ డ్యూటీతో సహా)
సేల్సు టాక్సు అదనము.

ఆంధ్రప్రదేశ్ కు డిస్ట్రిబ్యూటర్లు :
ఎస్. ఎస్. రేడియో & ఎలెక్ట్రికల్స్
చిక్కడపల్లి - ఫోన్ : 35414 - హైదరాబాద్ AA

# ఉచితమైన

అంద చందాల
స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రల
బహుమానాలు



మీరు కొను ప్రతి ఓకే తయారీ వస్తువుతోగల బహుమాన కూపనులను చేర్చిపెట్ట ప్రారంభించి, వానికి మారుగా ఇవ్వబడు అత్యాకర్షకమైన స్టెయిన్ లెస్‌స్టీల్ పాత్రలను — మీకు ఇష్టమైన పరిమాణ ప్రమాణాలలో — మీకు అతి సమీపమునగల ఓకే వ్యాపారివద్దనుండి పొందండి



తయారుచేసినవారు : ది ఈస్ట్ ఏస్యాటిక్ కం. (ఇండియా) ప్రైవేట్ లిడ్., మదరాసు.

EP.EAC-3 TEL

ఈ బహుమతి పథకం మదరాసు, మైసూరు, కేరళ మరియు ఆంధ్ర రాష్ట్రములకు మాత్రమే వర్తించును.


# గగన కుసుమం

పోయాడు. కారణమేమంటే, ఆ ఊరు వెళ్ళగానే అతని కొక విషాదవార్త తెలిసింది. రాధపెళ్లి ఆరు నెలల క్రిందే జరిగిపోయింది. ఆమె అత్తవారింటికి వెంటనే వెళ్లిపోయింది. ఆమె దురదృష్టంవల్ల, అత్తవారింట్లో చాలా కష్టాలు ప్రారంభమయ్యాయి. వాటిని భరించలేక కొద్దిరోజుల క్రితమే ఆమె ఆత్మహత్యచేసుకుంది. ఈ విషయం తెలిశాక, రెండు మూడురోజులకన్నా ఎక్కువ ఆ ఊళ్లో ఉండలేకపోయాడు భానుమూర్తి.

* * *

పదేళ్లతరువాత రంగారావు భానుమూర్తిని హైదరాబాదులో అకస్మాత్తుగా కలుసుకున్నాడు. అక్కడ ఏదో మందులకంపెనీలో సేల్సుమాన్‌గా పనిచేస్తున్నానని చెప్పాడు. ముందు టిప్‌టాప్‌గా డ్రెస్సూ, చేతిలో బ్యాగ్‌తో అతన్ని చూసి రంగారావు ఆశ్చర్యపడ్డాడు. భానుమూర్తి రంగారావుని తన ఇంటికి తీసికెళ్ళాడు. నారాయణగూడాలో చిన్న ఇల్లు. బాగానే ఉంది. భానుమూర్తికి ముగ్గురు పిల్లలు. మందులగురించీ, మందులకంపెనీ గురించి ఒక గంటసేపు భానుమూర్తి నోటంట లెక్చరు విన్నాక, రంగారావుకి—ఇతను తన స్నేహితుడైన భానుమూర్తేనా? లేక మరొక వ్యక్తా? అనిపించింది. ఆ కళాభిరుచీ, పాటలూ, బొమ్మలూ, అవన్నీ ఏమయ్యాయి? అనిపించింది. వాటి ప్రస్తావనే అతని మాటల్లో లేదు. రంగారావుకి ఇక ఎక్కువసేపు మందుల గురించి వినబుద్ధిగాక మళ్లీ కలుస్తానని చెప్పి భానుమూర్తిదగ్గర సెలవుతీసుకొని వెళ్లిపోయాడు.

రంగారావు వెళ్లిపోయాక భానుమూర్తి ఒక్కడూ హాల్లో కూచుని ఏదో ఆలోచించసాగాడు. ఇంతలో అతని భార్య, చేతిలో ఒక పుస్తకంతో హాల్లోకి వచ్చింది. ఆమె పొట్టిగా, లావుగా ఉంటుంది. సుమారు పాతికేళ్ల వయసు. ఆమె వస్తూనే "ఏమండీ, మీ పెట్టెంతా పిల్లలు పాడుచేస్తున్నారు. ఇదిగో ఈ బొమ్మల పుస్తకం, పెట్టె అడుగునుంచి బయటికి తీసి చింపెయ్యబోతూంటే నేను లాక్కున్నాను, ఇది మీకు ముఖ్యమైనదేమోనని." అని తన చేతిలోని పుస్తకాన్నతని కిచ్చింది.

అది, భానుమూర్తి రాధ చిత్రాలన్నీ వేసిన పుస్తకం. దాన్ని ఒకసారి తిరగేసి చూశాడు. అతని భార్య, "బొమ్మలు చాలా బావున్నాయి. ఎవరు వేశారండీ అవి?" అని అడిగింది.

" ఊ..... ఇవా? ...... ఒక స్నేహితుడు వేశాడులే" అన్నాడు.

"అన్నిటికీ క్రింద భా. మూ. అని ఉందేమండీ ?"

"అదా...... అతని పేరూ భానుమూర్తేలే!! ఇప్పుడు అతను లేడు" అన్నాడు భానుమూర్తి ఎటో చూస్తూ.

ఇంతలో వంటింట్లో ఏదో చప్పుడైతే భానుమూర్తి భార్య పిల్లలమీద విసుక్కుంటూ లోపలికెళ్లింది. భానుమూర్తి బొమ్మల పుస్తకాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు. ★